మనోజ్ఞ

కోపూరి పుష్పాదేవి

అర్ధరాత్రి. అప్పుడే రెండు గంటలు కొట్టింది గడియారం. మనోజ్ఞకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. "అబ్బ... ఒళ్ళంతా నొప్పులుగా ఉన్నాయే... అమ్మో ఏమిటీ శ్వాస ఇంత వేడిగా వస్తోంది... జ్వరం వచ్చిందా తనకు...?

"అబ్బ... ఒళ్ళంతా మంటలు, వేడి. నిప్పుల మధ్య ఉన్నట్లుంది. ఎటూ కదలనివ్వకుండా ఇంత నొప్పులుగా ఉందేమిటి శరీరమంతా...?

"అమ్మా..."

ఎవరో చల్లని హస్తం తన నుదిటి మీద పెట్టారు. ఇప్పుడు కొద్దిగా హాయిగా ఉంది. ఉడుకులాన్ పట్టీకూడా పెడుతున్నారు. కళ్ళు తెరిచి వారెవరో చూడాలని ప్రయత్నించింది మనోజ్ఞ. కానీ కళ్ళు తెరిపిడి పడడం లేదు. అవి కూడా మండుతున్నాయి. చేతితో తడిమి చూడాలనుకుంది గానీ, అదీ సాధ్యమవలేదు. ఆ వ్యక్తెవరో ఇప్పుడు తన అరి పాదాలు నెమ్మదిగా రాస్తున్నారు. ఇప్పుడు కూడా హాయిగా ఉంది. ఎవరో మెల్లగా తన శిరస్సు నిమురుతున్నారు.

"ఎవరు...? ఎవరు...?"

"అమ్మ...! ఔను నిజంగా అమ్మే..."

"ఔను. ఖచ్చితంగా అమ్మదే ఆ స్పర్శ..."

"కానీ, ఎప్పుడో పన్నెండేళ్ళనాడు, తనకు ఎనిమిది సంవత్సరాల వయస్సులో చనిపోయిన అమ్మ... ఎలా తిరిగి వచ్చింది...? తనకు జ్వరంగా ఉన్నదని, చాలా బాధ పడు తోందనీ వచ్చిందా...! లేక తనే అమ్మ దగ్గరకు వెళ్ళిందా ...?"

ఉలిక్కిపడి, చటుక్కున కళ్ళు విప్పి చూసింది

మనోజ్ఞ. పైన ఫ్యాను తిరుగుతోంది. గదిలో లైటు వెలుగుతోంది. లేదు తను చనిపోలేదు. మంచం మీద పడుకుని ఉంది.

లైటు వెలుగు చూడలేక, గబుక్కున కళ్ళు మూసుకుంది మనోజ్ఞ. అనుమాన నివృత్తి కోసం అన్నట్లు, "అమ్మా..." అని పిలిచింది మెల్లగా.

"ఏమ్మా ఏం కావాలి...? నేనిక్కడే ఉన్నా. భయపడకు..." అని బదులిచ్చింది ఒక స్వరం. సందేహం లేదు. ఆ గొంతు కూడా అమ్మదే. కానీ... ఇదెలా సాధ్యం..."

"చనిపోయిన అమ్మ ఎలా తిరిగి వస్తుంది...? లేక అమ్మ మరణించడం అబద్ధమా...? మరయితే, అప్పుడు అందరి ఏడుపులు, పాడె గట్టటం, అమ్మకు దండలు వేసి దాని మీద పడుకోబెట్టడం, తీసుకువెళ్లి పోవడం, అవన్నీ ఏమిటి...?"

"మరి... ఇప్పుడూ అమ్మే..."

"అయితే, అమ్మ చనిపోవడం నిజం కాదా ...? లేక అమ్మ ఇన్నాళ్ళూ ఎక్కడో దాక్కుని ఉండి ఇప్పుడు తిరిగి వచ్చిందా...?"

"అమ్మ కోసం తను ఎంత ఏడ్చింది... ఎంతగా అల్లాడిపోయింది... ఎంత బెంగ పడింది...? అయినా అమ్మా మనూ... నీకోసం నేనున్నాను. నీకేం భయం లేదు..." అని చెప్పిన వాళ్ళు ఒక్కరూ లేరు.

"వదినకు ఎంతసేపూ అందరూ తనమాట వినాలనే పట్టుదలే తప్ప ప్రేమ, అభిమానం చూపించడమే తెలియదు. అన్నయ్యా అంతే. నాన్న కూడా అంతే. అమ్మే మంచిది. నన్ను ప్రాణంగా చూసుకుంటుంది. మళ్ళీ ఈసారి అమ్మను వెళ్ళనీయకూడదు. అమ్మ నా దగ్గరే ఉండాలి... ఔను నా దగ్గరే ఉండిపోవాలి. అమ్మ... అమ్మ..."

జ్వరం కొద్దిగా జారడంతో మత్తుగా నిద్ర పోయింది మనోజ్ఞ.

తిరిగి ఆమెకు మెలకువ వచ్చేసరికి, వళ్ళు కొంచెం తేలికగా అన్పించింది. ఎవరివో మాటలు విన్పిస్తున్నాయి.

"ఏమిటమ్మా... రాత్రంతా అలాగే కూర్చున్నావా... కొద్దిసేపు కూడా పడుకున్నట్లు లేదే ...?"

అది తన భర్త సంజయ్ గొంతు.

"లేదురా, రాత్రి తనకు జ్వరం బాగా వచ్చింది. ఒళ్లు నెప్పులు, తలనెప్పితో చాలా బాధపడింది. ఏమిటేమిటో కలవరించింది. టాబ్లెట్స్ వేశాను. మూడు దాటాక కాబోలు... కొద్దిగా నిద్ర పట్టింది తనకి.

అది తన అత్తగారి గొంతు.

"అంటే... అంటే... రాత్రంతా తనకు కణతలు రుద్ది, పాదాలు వత్తి రకరకాల సేవలు చేసింది తన అత్తగారా...? తను మొహమైనా చూడడానికి ఇష్టపడని తన అత్తగారా...?"

"తను ఎంత పాపిష్టిది...?"

వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం విని, తృళ్ళిపడి మనోజ్ఞ మంచం దగ్గరకు వచ్చారు తల్లీ కొడుకులు.

"ఏమ్మా... మళ్ళీ జ్వరం పెరిగిందా... ఒళ్ళు నెప్పులుగా ఉన్నాయా...? అరుంధతి గాబరాగా దగ్గరకు వచ్చి, నుదురు తాకి చూసింది.

"లేదన్నట్లు" తల తిప్పింది కానీ మనోజ్ఞకు దుఃఖం ఆగడం లేదు. ఆమె ఎందుకు ఏడుస్తోందీ అర్థంగాక ఇద్దరూ తెల్లబోయారు.

తనకు తనే తెప్పరిల్లిన మనజ్ఞ "వెళ్దామా...?" అని అడిగింది భర్తను ఉద్దేశించి.

"ఎక్కడికి...?" ఇద్దరూ ఒక్కసారే అడిగారు ఆదుర్దాగా.

"నర్సింగ్ హోమ్‌కి..."

"ఎందుకమ్మా... జ్వరం తగ్గిపోయిందిగా, ఒంట్లో ఏమయినా బాధగా ఉందా...?" మనోజ్ఞ ప్రక్కనే మంచం మీద కూర్చుని, ఆమె వెంట్రుకలు సర్దుతూ ఆప్యాయంగా అడిగింది అరుంధతి.

"కాదత్తయ్యా... వంద డిగ్రీల జ్వరం వచ్చినా, మా వాళ్ళు నన్ను తీసుకువెళ్ళి ఆ నర్సింగ్ హోమ్‌లో పడేసేవాళ్ళు. లేకపోతే నాకు చాకిరీ ఎవరు చేస్తారు...?" చెప్తూంటే మళ్ళీ ఏడుపు పొంగుకొచ్చింది మనోజ్ఞకు.

"పిచ్చితల్లీ... నేను లేనూ... ఈ మాత్రానికే హాస్పిటల్లో జాయినవ్వాలా... ఎలాగూ ప్రతి రోజూ డాక్టర్‌గారొచ్చి చూస్తారు గదా... ఏమంటావు..." అన్నది అరుంధతి థర్మా మీటరు తెస్తూ.

"మీ ఇష్టం అత్తయ్యా..." అన్నది మనోజ్ఞ తేటపడిన మొహంతో. ఆమెకు హాస్పిటల్ అంటే ఎలర్జీ. "వేణ్ణీళ్ళు తెస్తాను" అంటూ అరుంధతి అవతలకు వెళ్ళగానే, దగ్గరకు వచ్చిన సంజయ్‌ను చుట్టేసి, మళ్ళీ బావురు మంది మనోజ్ఞ.

"ఛ, ఊరుకో, ఈ కాస్త జ్వరానికే ఏడుస్తారా ఎవరైనా..." నవ్వుతూ అన్నాడు సంజయ్.

"జ్వరం వచ్చినందుకు కాదు నా బాధ..." అన్నది కానీ, ఎందుకో చెప్పలేకపోయింది.

హాట్ వాటర్‌తో మనోజ్ఞ మొహం కడుక్కునేందుకు సాయం చేసి, బట్టలు మార్పించి, కొద్దిగా బ్రెడ్ తినిపించి, వేడి పాలతో టాబ్లెట్స్ మింగించి, కొద్దిసేపు హాయిగా పడుకోమ్మా మనూ, లేచేసరికి పూర్తిగా తగ్గిపోతుంది..." అని చెప్పి, తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది అరుంధతి.

"అంటే... రాత్రి అమ్మ రావడం, నన్ను అక్కున చేర్చుకోవడం... అంతా తన భ్రమా...? జ్వర తీవ్రతలో అత్తగారి స్పర్శనే నేను అమ్మ అని భ్రాంతి పడ్డానా...?"

"అమ్మ ఉన్నా, ఇంతకన్నా ప్రేమగా, శ్రద్ధగా చెయ్యలేదేమో...?"

"ఇన్నాళ్ళూ ఈ దేవతనా నేను దూరం చేసుకోవాలనుకున్నది...?"

మనోజ్ఞ ఎనిమిదేళ్ళ వయసులో ఉండగా, ఆమె తల్లి పార్వతి మరణించింది. మనోజ్ఞకు ఒక అన్న ప్రసాద్. పదమూడేళ్ళవాడు. రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్నాడు. తండ్రి రాజారామ్‌గారు మళ్ళీ వివాహమయితే చేసుకోలేదు గానీ, బొత్తిగా పిల్లల మంచి చెడులు చూసేవాడు కాదు. అసలు పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడమే ఆయనకు తెలియదు. చాలా భారీగా క్లాత్ బిజినెస్ చేసేవాడు. అందులోనే ఆయనకు ఊపిరి సలపనంత పని ఉండేది.

లంకంత ఇంటిలో మనోజ్ఞ ఒంటరిగా బిక్కు బిక్కు మన్నట్లు ఉండేది. వాళ్ళకు బంధువులు తక్కువ. అమ్మమ్మ, నాయన మ్మలను కూడా ఆమె ఎరుగదు. వంట మనిషి పెట్టింది తిని, స్కూల్‌కి వెళ్ళి వచ్చి, ఏకాకిలా తన గదిలో కాలక్షేపం చేసేది. ఏమిటో మరి... ఆ అమ్మాయికి స్నేహితులూ లేరు. చదువు మీద కూడా పెద్దగా ఇంట్రెస్ట్ లేదు. తండ్రి మాదిరే అన్న ప్రసాద్ కూడా. చెల్లెలు అని ప్రేమ, అభిమానం చూపే వాడు కాదు. ఆ ఇంట్లో ఎవరి గది వాళ్ళది. ఎవరికి ఆకలి వేస్తే వారు డైనింగ్ రూమ్‌కి వెళ్ళి, వంట మనిషి చేత పెట్టించుకు తినేవాళ్ళు. అలా సంవత్సరాల తరబడి ఒంటరితనం అలవాటయిపోయింది మనోజ్ఞకు.

అలాగే పదేళ్ళ కాలం గడిచిపోయింది. ప్రసాద్‌కు పెళ్ళి అయి, వదిన రమ్య కాపురానికి వచ్చినా మనోజ్ఞ స్థితిలో మార్పేమీ రాలేదు.

మామగారు ఇచ్చిన అలుసుతో రమ్య మనోజ్ఞపై అభిమానం కన్నా, అధికారం ఎక్కువ చూపించేది. ఆమెకు అది నచ్చేది కాదు.

మనోజ్ఞకు సంజయ్‌తో పెళ్ళి అయింది. వాళ్ళది కూడా అదే ఊరు. అతను ఇంజనీరింగ్ కాలేజిలో లెక్చరర్. అతని తండ్రి ప్రభాకర్ రైస్ బిజినెస్ చేస్తారు. ఒక చిన్న తమ్ముడు ధనుంజయ్. ఫస్ట్ క్లాస్ చదువుతున్నాడు. మధ్యలో ముగ్గురు పిల్లలు చనిపోవడంతో అన్నదమ్ముల మధ్య వయసులో అంత ఎడం వచ్చింది.

పెళ్ళి అయి మూడు నెలలు దాటింది. మంచి రోజు చూసి, కాపురానికి పంపడి అన్నారు మనోజ్ఞ అత్తవారు. ఆ సంగతి కూతురికి చెప్పాడు రాజారామ్. ఆమె ఏమీ మాట్లాడలేదు. తన డ్యూటీ అయిపోయినట్లు వెళ్ళి పోయాడు ఆయన.

ఇది జరిగిన నెల రోజులకు మనోజ్ఞ అత్తగారు అరుంధతి బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోయింది. కాలు ఫ్రాక్చరయి చాలా నెప్పి చేసింది. సిమెంట్ కట్టువేసి, ఒక నెల రోజులు ఏ పనీ చేయకుండా విశ్రాంతి తీసుకోమన్నారు డాక్టరు.

"కొన్నాళ్ళు అమ్మకు సాయంగా ఉందువు. ఇంటికి రమ్మని పిలవడానికి వచ్చాడు సంజయ్ మనోజ్ఞను. అతను గంటసేపు కూర్చున్నా వస్తానని గాని, రానని గానీ ఏమీ చెప్పలేదు ఆమె. అతనికి విసుగు వచ్చి గట్టిగా అడిగితే కన్నీరు పెట్టుకున్నది. కోపం వచ్చి వెళ్ళి పోయాడు సంజయ్.

తరువాత కొన్నాళ్ళకు ప్రభాకర్ గారు స్వయంగా వచ్చి కాపురానికి పంపమని అడిగినా ఫలితం లేకపోయింది.

చిరాకు వచ్చిన సంజయ్ ఏదో ఒకటి తేల్చుకుందామని పట్టుదలగా వచ్చాడు ఆ రోజు. "నువ్వు నీ ఉద్యోగం వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటే వస్తుందటయ్యా అమ్మాయి..." అని చావు కబురు చల్లగా చెప్పాడు రాజారామ్.

ఇది విని నిర్ఘాంతపోయాడు సంజయ్. విద్యుద్ఘాతం తిన్నవాడిలా విలవిలలాడేడు. చెట్టు నుంచి విరిచిన కొమ్మలా వాడిపోయేడు. ఆ తండ్రీ కూతుళ్ళ మనస్తత్వమేమిటో బోధపడ లేదు అతనికి.

ఎంతగా బ్రతిమాలి బుజ్జగించినా భార్యను ఒప్పించలేక, తల్లిదండ్రుల్ని నొప్పించలేక నలిగిపోయాడు సంజయ్. ఆఖరుకు "ఈ సంక్రాంతి పండుగ మూడు రోజులన్నా మా ఇంట్లో ఉంటే నీ కోరిక గురించి ఆలోచిస్తాను" అని షరతు పెట్టాడు సంజయ్. అతి కష్టంమీద ఒప్పుకుని, అత్తగారింటికి వచ్చిన ఆమెకు ఆ రాత్రే విపరీతమయిన జ్వరం వచ్చింది.

అప్పుడప్పుడే ఉదయభానుని బంగారు కిరణాలు భువిని ముద్దిడుతున్నాయి. ఆ మధుర స్పర్శకు పులకించిన వృక్షరాజాలు మత్తుగా ఊగాయి. పక్షి సంతతి నిద్ర వదిలించుకుని, కిలా కిలా రావాలతో ఆ లేత కిరణాలకు స్వాగతం చెప్తున్నాయి.

అప్పుడే కొద్దిగా నిద్రపట్టిన మనోజ్ఞ నుదిటి మీద చల్లని స్పర్శకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూసింది.

ఆరు సంవత్సరాల మరిది ధనుంజయ్ "జ్వరం తగ్గిందా వదినా..." అని అడుగు తున్నాడు.

"సారీ వదినా, రాత్రి నీకు ఫీవర్ బాగా వచ్చిందట గదా, నేను నిద్రపోయాను. నాకు తెలియదు. వచ్చి నిన్ను చూడలేదు..." పెద్ద ఆరిందాలా చెప్తున్న వాడి మాటలకు, నిజాయితీ ధ్వనించిన ఆ స్వరానికీ చలించి "రా బాబూ ఇలా కూర్చో" అంటూ తను జరిగి, వాణ్ణి తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నది మనోజ్ఞ.

"నిన్న మా స్కూల్లో ఏమయిందనుకున్నావు వదినా, నా ప్రక్కన కూర్చుంటాడు చూడూ హరి, వాడి పెన్సిలేమో వెనుక కూర్చునే ఉదయ్ తీసి, తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. అది నేను చూశాను. పెన్సిల్ పోయిందని హరి ఏడు స్తూంటే మిస్ అందరినీ అడిగారు. "అందరూ మేము తీయలేదు" అన్నారు. నేనేమో ఉదయ్ తీసిన సంగతి చెప్పాను. మిస్ పెన్సిల్ హరికి ఇప్పించి, ఉదయ్‌ని ఒక దెబ్బ కొట్టారు. "ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యవద్దని" చెప్పి. మేమందరమూ ఉదయ్‌కి షేమ్, షేమ్ చెప్పాము. చూడు వదినా, ఆ కోపంతో వాడేం చేశాడో... గ్రౌండ్‌లో నన్ను తోశేశాడు..." అంటూ చిన్న దెబ్బ తగిలిన మోకాలిని చూపిం చాడు ధనుంజయ్.

"అయ్యో పాపం... దెబ్బ తగిలిందా..." అంది మనోజ్ఞ.

"ఛఛ... ఇటువంటి చిన్న చిన్న దెబ్బలను నేను పట్టించుకోను వదినా. మగాణ్ణి కదా..." మీసం మెలివేస్తున్నట్లు ఫోజు పెట్టి చెప్పాడు వాడు. వాడి ఫోజుకు ఫక్కుమని నవ్వి, "నువ్వు భలేవాడివయ్యా..." అన్నది మనోజ్ఞ.

"ఔనంట వదినా, అందరూ ఆ మాటే అంటారు. ఎందుకో నాకూ అర్థం కాదు..." కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అన్నాడు సంజయ్.

వాడి చిలిపి మాటలకు నవ్వురాగా, ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, ముద్దు పెట్టుకుంది ఆమె.

"ఛ... ఏమిటి వదినా, నువ్వు కూడా అమ్మలాగా..." సిగ్గు పడ్డాడు ధనుంజయ్.

"ఏరా ధనూ, వదిన్ని విశ్రాంతి తీసుకోనీయకుండా, నీ కబుర్లతో విసిగిస్తున్నావా?... ఇలా వచ్చేయ్... అంది అరుంధతి, చిన్నవాడని గారం చేయడంతో వాడికి చిలిపితనం, కొంటె చేష్టలూ ఎక్కువ.

"లేదత్తయ్యా, ధనూని నా దగ్గర ఉండనివ్వండి. మేమిద్దరం ఇప్పుడు దోస్తులమయ్యాం ..." నవ్వుతూ అంది మనోజ్ఞ.

"నిజంగానా వదినా... అయితే మన మిప్పుడు పార్టీ చేసుకుందాం. నా దగ్గర జామకాయ ఉంది తెస్తాను ఉండు..." అంటూ తుర్రుమన్నాడు పిలుస్తున్నా విన్పించుకోక.

కొద్దిసేపటికి మామగారు ప్రభాకర్ వచ్చారు గదిలోకి. "ఏమ్మా ఇప్పుడు కొద్దిగా తేలికగా ఉందా... రాత్రి చాలా బాధ పడ్డావుట. నేనిప్పుడే వైజాగ్ నుంచి వచ్చాను. రాగానే అరుంధతి చెప్పింది. ఇప్పుడు కులాసాగా ఉన్నట్లే కదా... డాక్టరు గారు వస్తారు. నీకేం కావాలన్నా మొహమాటం లేకుండా మమ్మల్ని అడుగమ్మా. నేను నీ తండ్రి లాంటి వాణ్ణే. ఏమీ బిడియపడకు" అంటూ ఆప్యాయంగా ఆమె తలనిమిరి, షాపుకి టైమ్ అవుతోందంటూ వెళ్ళిపోయారు ఆయన.

ఆయన చూపించిన అభిమానానికి మనోజ్ఞ సిగ్గుపడిపోయింది. "హు తన కన్న తండ్రి ఒక్కనాడైనా ఇలా పలుకరించాడా...? ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడా... అసలు తన మొహమే చూడడు ఆయన. ఏదో కన్నాడు కాబట్టి, బాధ్యత ఉంది కాబట్టి, పెళ్ళి చేసి చేతులు దులుపుకున్నాడు.

"మీ ఇంటికి ఫోన్ చెయ్యనా. నీకిలా జ్వరంగా ఉందని" అడిగాడు సంజయ్ ఆమెకు కాఫీ తీసుకువచ్చి ఇస్తూ.

"వద్దు" అంది మనోజ్ఞ మంచం దిగబోతూ.

"వాళ్ళు కంగారు పడతారేమోనని వద్దంటున్నది..." అనుకున్నాడు అతడు.

"జ్వరమని తెలిసినా, ఒకే ఊరయినా వాళ్ళు రారు" అనుకుంది ఆమె.

ఆ పగలంతా తగ్గిన జ్వరం రాత్రి పదకొం

దు గంటలకు మళ్ళీ తీవ్రంగా వచ్చింది విపరీత మయిన చలితో. హడావిడిగా ఫ్యామిలీ డాక్టర్ కు ఫోన్ చేశారు ప్రభాకర్ గారు. అనుకోకుండా ఊరెళ్ళారట ఆయన.

"ట్యాబ్లెట్స్ వేద్దాం. తగ్గిపోతుంది లెండి ..." అంది అరుంధతి.

ఒక రాత్రప్పుడు వాంతులు కూడా మొద లయ్యాయి మనోజ్ఞకు. ప్రతిసారీ బెడ్‌షీట్స్, ఒంటిమీది బట్టలూ, గదీ... అన్నీ ఖరాబయినా, రవ్వంతయినా విసుగు లేకుండా బెడ్ షీట్స్ మార్చి, గది స్వయంగా శుభ్రం చేస్తున్న అత్త గార్ని చూసి అవాక్కయింది మనోజ్ఞ.

"ఈమెకు నేనేం చేశానని నాకింత సేవ చేస్తోంది? కనీసం నోరారా అత్తయ్యా అని పిలి చి కూడా ఎరుగనే... పైపెచ్చు ఆమె కొడుకుని ఆమెకు దూరం చేయాలని చూశానే... నా మీద కోపం లేదా ఈమెకు...? ద్వేషం లేదా...? కాలికి కట్టుతో మంచంలో ఉన్న తనను కనీసం చూడడానికి కూడా రాని తన మీద అసహ్యం వెయ్యడం లేదా అత్తయ్యకు...? మూగగా రోదించింది మనోజ్ఞ మనసు. ఆ జ్వరం మలే రియాలోకి దించి చాలా బాధ పెట్టింది ఆమెను. జ్వరం తగ్గే వరకూ అరుంధతి ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంది. నోటికి సహించక, మ నోజ్ఞ బ్రెడ్‌గాని, పండ్లుగానీ తినకపోతే మేమూ భోజనం చేయమంటూ, ఆఖరుకి మామగారితో సహా పట్టుపట్టేవారు.

అసలు ఆ ఇంట్లో పద్ధతులే మనోజ్ఞకు విచి త్రంగా అన్పించేవి. ఎంత టైమ్ దాటి పోయినా భోజనమైనా, టిఫినైనా అందరూ కలిసి తినవల సిందే. ఒక్కరు రాకపోయినా, మిగతావారు అలా ఎదురుచూస్తూ కూర్చునేవారు తినకుండా. ఆ ఇంట్లో సభ్యులు ఫ్యామిలీ మెంబర్లలా కాక, ప్రాణస్నేహితుల్లా మసుల్తారు.

మనోజ్ఞకు జ్వరం తగ్గిపోయింది గాని, ఇం కా నీరసంగా ఉంటోంది. పనిఅమ్మాయి తెచ్చిన తాజా గోరింటాకు రుబ్బి ఇచ్చి, మనోజ్ఞను పెట్టు కొమ్మంది అరుంధతి. నాకు రాదంది మనోజ్ఞ.

అరుంధతి ఓపికగా కూర్చుని మనోజ్ఞ రెండు చేతులకూ పెట్టడమే కాక, పాదాలకు పారాణి కూడా పెట్టింది. ఎర్రగా పండిన మనో జ్ఞ పసిమి చేతులను చూసి ఆమె ఎంత మురిసి పోయిందో. ప్రభాకర్‌గారిని కూడా పిలిచి చూ పించింది. ఇక ధనుంజయ్ అయితే ఒకటే గొడవ. "తనకు కూడా వదినకు పండి నంత ఎర్రగా కావాలని".

భర్త అనురాగం, అత్తగారి ఆప్యాయత, మామగారి అభిమానం, మరిది అల్లరి... మనో జ్ఞను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆ ప్రేమ వాహినిలో మునిగిపోయిన ఆమెకు రోజులు ఎలా గడిచిపోతున్నాయో కూడా తెలియడం లేదు. నరకం నుండి స్వర్గంలోకి, మండుటెం డలో నుంచి చల్లని వెన్నెలలోకి వచ్చినట్లుగా ఉంది ఆమె పరిస్థితి. అత్తగారింట్లో అంత ఆద రణ పొందగలనని ఆమె కలలో కూడా అనుకో లేదు. అసలు కుటుంబ సభ్యుల మధ్య అటు వంటి అనురాగాలు, ఆప్యాయతలూ టీవీలో, సినిమాల్లో చూడడమే కానీ నిజంగా కూడా ఉంటాయని ఆమె ఊహించలేదు. ఆమె పెరి గిన ఇంటి వాతావరణం, ఆమెకు మనుష్యులం టేనే విముఖతను పెంచి, బతకడం అంటే ఆకలికి తినడం, నిద్రవస్తే పడుకోవడంలా నిస్సారంగా జీవితం గడపడమే కాబోలు అను కునేటట్లు చేసింది.

అయిన వారి ఆత్మీయతలోని అతి మధుర రుచి ఆమె ఇప్పుడిప్పుడే ఆస్వాదిస్తోంది.

ఒకరోజు కాలేజి నుంచి రాగానే సంజయ్ మనోజ్ఞ దగ్గర ఒక బాంబు పేల్చాడు. "బెంగు

ళూర్‌కి ట్రాన్స్‌ఫర్ వచ్చింది" అంటూ.

తృళ్ళిపడింది మనోజ్ఞ.

"నీ కోరిక తీరిందిగా బయల్దేరు..." అన్నాడు.

"ఏమండీ నిజం చెబుతున్నారా..." నమ్మలేనట్లు అడిగింది.

"నిజమే. బదిలీ చేయించుకొమ్మని నువ్వే గదా గొడవ చేశావు. ప్రయత్నించాను వచ్చింది..." అన్నాడు సంజయ్ చిద్విలాసంగా.

"ఎప్పుడో ఏదో అన్నానని సాధిస్తున్నారా... ఆ బదిలీ వద్దని చెప్పండి. మనం ఇక్కడే ఉందాం..." అన్నది మనోజ్ఞ బిక్కమొహం పెట్టి.

"అంతా నీ ఇష్టమేనా, కావాలనడానికి, మళ్ళీ వద్దనడానికీ అదేం మన సొంత సంస్థ కాదు..."

"మరిప్పుడు ఎలాగండీ..., ఎవరి చేతయినా చెప్పిద్దామా...?"

"ఎవరు చెప్పినా వాళ్ళేం వినరు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే, అసలు ఉద్యోగమే పీకేస్తారు..."

"అమ్మో... అలాగయితే మీరు బెంగుళూరు వెళ్ళిపోండి. నేనిక్కడే ఉండిపోతాను. అత్తయ్య లేకుండా నేనుండలేను..."

"మరి... నువ్వు లేకుండా నేనూ ఉండలేను గదా. నాతో నువ్వు రావలసిందే. పట్టు పట్టాడు సంజయ్. మనోజ్ఞ దిగులు పడిపోయింది. ఆ విపత్కర పరిస్థితి నుంచి ఎలా బయట పడాలో ఆమెకు అర్థం కాలేదు.

చిన్నబోయిన ఆమె మొహం చూసి, అరుంధతి అడిగింది "సంగతేమి"టని...

మనోజ్ఞ చెప్పింది విని "ఏరా సంజయ్... నిజమేనా..." అన్నది అరుంధతి.

"నిజమే" నన్నాడు.

"పోతే పోయిందిలే. దిక్కుమాలిన ఉద్యోగం. ఇక్కడే ఏదో ఒకటి దొరక్కపోదు. అంతగా దొరకకపోతే, ఏదో ఒక బిజినెస్ చేసుకుందువు గాని..." అన్నది అరుంధతి చిక్కుడు కాయలు వలుస్తూ.

ఆ మాట వినగానే, మనోజ్ఞ మొహంలో వేయి దీపాల వెలుగు వచ్చింది. "అలా చెయ్యండి" అంది చటుక్కున.

"అలా చెయ్యండి..." అంటూ మనోజ్ఞను వెక్కిరించాడు సంజయ్. అప్పుడేమో బదిలీ చేయించుకొమ్మని చంపావు. ఇప్పుడు వద్దంటున్నావు. బదిలీ మాట అబద్ధమేలే. అయినా... అప్పుడు నేనెంత నరకం అనుభవించానో తెలుసా..." అన్నాడు భార్యా, తల్లీ కూర్చున్న దగ్గరకు వచ్చి వాళ్ళతో పాటే తనూ నేలపై కూర్చుని చిక్కుడు గింజ నోట్లో వేసుకుంటూ.

"సారీ అండీ... వెరీవెరీ సారీ. ఈ జ్వరం రాకపోతే నేను ఇప్పటికీ ఆ మూర్ఖత్వంలోనే ఉండేదాన్ని. ఈ జ్వరం నాకు చాలా మేలు చేసింది. నన్ను క్షమిస్తారా అత్తయ్యా..." అంటూ ఆమె వడిలో తలదాచుకుంది మనోజ్ఞ.

"అంత మాట ఎందుకు పిచ్చిదానా..., అయినా తప్పు చేయడం మానవ సహజం. దానిని దిద్దుకోవడంలోనే మన జ్ఞానం ఉపయోగించాలి..." అంటూ కోడల్ని గుండెలకు హత్తుకుంది అరుంధతి.

"అమ్మో... మీ ఆడవాళ్ళకు ఏది వచ్చినా కష్టమే. ఇప్పుడు మీరిద్దరూ ఒకటయిపోయారు. నేను పరాయి వాడినయ్యాను..." అంటూ సంజయ్ పెట్టిన బుంగమూతిని చూసి, ఫక్కున నవ్వారు అత్తాకోడళ్ళు.

ఆ దృశ్యం ఎంతో మనోజ్ఞంగా తోచింది సంజయ్‌కు. ●